సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 29 । ఏప్రిల్ । 2023



నేత్రపర్వం.. వీరేశ్వరుని గ్రామోత్సవం


బ్రహ్మోత్సవాల్లో భాగంగా మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వర స్వామివారి త్రిశూల స్నానం, రథోత్సవం తదితర వేడుకలను శుక్రవారం కోలాహలంగా నిర్వహించారు. IIలో



ముంచుకొస్తోంది.. ముహూర్తాల వేళ

నెల రోజుల విరామం తరువాత కల్యాణ మండపాలు మళ్లీ కళకళలాడనున్నాయి. IIలో

డెల్టాలకు 3,350 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 3,350 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు 50, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 5.80 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

బాలుడి వైద్యానికి భరోసా



బాధితులకు పీఎంఆర్‌ఎఫ్ ఫండ్ పత్రం అందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ గీత

గోకవరం: అరుదైన బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న గోకవరానికి చెందిన **రెండున్నరేళ్ల** బాలుడు సత్యశ్రీ అక్షయ్‌రామ్ **వైద్యానికి రూ.3** లక్షల ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్ (**పీఎంఆర్‌ఎఫ్**) మంజూరైంది. బాలుడి పరిస్థితిని **ఎంపీ వంగా** గీత దృష్టికి ఎంపీపీ సుంకర **శ్రీవల్లి తీసుకు** వెళ్లారు. ఎంపీ చొరవతో పీఎం**ఆర్‌ఎఫ్ నిధులు** మంజూరయ్యాయి. కాకినాడలో **కలెక్టర్ కృతికా** శుక్లా, ఎంపీ వంగా గీత చేతుల మీదుగా బాలుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం మంజూరు పత్రం అందజేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా బాలుడికి పూర్తి వైద్యం అందించేందుకు కలెక్టర్ చర్యలు చేపట్టారని ఎంపీపీ తెలిపారు. దీనికి రూ.11 లక్షలు మంజూరు చేయాలని ఆరోగ్యశ్రీ డీసీని కలెక్టర్ ఆదేశించారని, తద్వారా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో బాలుడికి ఉచితంగా వైద్యం అందుతుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు కూడా పాల్గొన్నారు.

రుడా వైస్ చైర్మన్‌గా బాలస్వామి



రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలస్వామి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) వైస్ చైర్మన్‌గా బాలస్వామి నియమితులయ్యారు. ఇప్పటి వరకూ వైస్ చైర్మన్‌గా ఉన్న నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ నుంచి శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బాలస్వామి ఇప్పటి వరకూ తాడేపల్లిగూడెం కమిషనర్‌గా పని చేశారు.

“ పెద్ద చదువుకు దారిలేదు



చిన్నప్పటి నుంచి కష్టాలు అలవాటయిపోయాయి. 8వ తరగతిలోనే నాన్న పోయాడు. తర్వాత ఇబ్బందులు మొదలయ్యాయి. మధ్యాహ్న భోజనం పథకం ఆదుకుంది. 10వరకూ గవర్నమెంటు స్కూలులో చదివాను. తరువాత యర్నగూడెంలో ప్రభుత్వ కాలేజి వచ్చింది. ఇరుగూ పొరుగూ సాయపడేవారు. వారే ఫీజు కట్టేవారు. 939 మార్కులు వచ్చాయి. అన్ని పరిస్థితులూ బాగుంటే ఇంకా ఎక్కువ మార్కులు వచ్చేవనిపిస్తుంది. పెద్ద చదువు చదవాలన్నా దారిలేదు.

కోన హరిక..యర్నగూడెం

“ లెక్చరర్ కావాలని..



మాది చాగల్లు మండలం నెలటూరు. నాన్న ఎలక్ట్రికల్ పని చేస్తారు. అమ్మ గృహిణి. చాగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివాను. బైపీసీలో 936 మార్కులు రావడం సంతోషంగా ఉంది. పదో తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను. మా అమ్మానాన్నలు, అధ్యాపకుల ప్రోత్సాహంతో కష్టపడి పట్టుదలతో చదివాను. భవిష్యత్‌లో జువాలజీ లెక్చరర్ కావాలని ఉంది.

– తోలేటి ప్రసన్న, ప్రభుత్వ జూనియర్ కళాశాల, చాగల్లు, తూర్పు గోదావరి జిల్లా

“ డాక్టర్ అవ్వాలని..



మా నాన్న వ్యవసాయ కూలీ. మా అన్నయ్య కూడా పొలం పనులకు వెళ్తుంటాడు. బాగా చదవాలనే కోరికతో నన్ను చదివిస్తున్నారు. కోమటికుంట నుంచి రోజూ 5 కిలోమీటర్లు సైకిలుపై గోపాలపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీకి వెళ్లేదాన్ని. డాక్టర్ కావాలనే ఉద్దేశంతో ఇంటర్‌లో బైపీసీ గ్రూపు తీసుకున్నాను. తాజాగా వచ్చిన ఫలితాల్లో 907 మార్కులు వచ్చాయి. మాకున్న పరిస్థితుల్లో ఈ మార్కులు రావడం సంతోషం కలిగించింది.

– సత్యకీర్తి, కోమటికుంట, గోపాలపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా

సర్కారీ విక్రమార్కులు

వీరు మట్టిలో మాణిక్యాలు.. సాధారణ పరిస్థితుల మధ్య పెరుగుతూ వెలుగులు చిందిస్తున్న జ్యోతులు.. పేదరికం ప్రతిభకు ఏమాత్రం అడ్డు కాదని నిరూపిస్తున్న ధీరులు.. చదువుపైనే గురి పెట్టి లక్ష్యం సాధించిన విజేతలు.. నిన్నటి ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో మార్కులతో ప్రకాశించిన ప్రతిభావంతులు. కార్పొరేట్ సంస్థల విద్యార్థులకు ఏమాత్రం తీసిపోమని చాటిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు.. ప్రభుత్వ బడుల్లో చదివే వారికి స్ఫూర్తి ప్రదాతలు..



- ప్రభుత్వ కాలేజీల్లో ఉత్తమ ఫలితాలు
- ప్రతిభతో రాణించిన పేదింటి పిల్లలు
- 'కార్పొరేట్' సంస్థలకు దీటైన సమాధానం
- ఇంటర్‌లో రాణించిన ప్రతిభావంతులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ/నెట్‌వర్క్: తాజాగా విడుదలైన ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు రాణించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఈసారి మెరుగైన ఫలితాలే వచ్చాయి. ఈ కళాశాలల్లో పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులు మెరికల్లా రాణించారు. వీరి ప్రతిభకు ప్రభుత్వ విధానాలు తోడయ్యాయి. 'నాడు–నేడు' పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో తీసుకువచ్చిన మార్పులు సత్ఫలితాన్నిస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్లుగా విద్యారంగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు, కళాశాలలు నిలబడాలనేది ఆయన బలమైన సంకల్పం. అందుకే ఈ రంగానికి నిధుల లోటు రానీయకుండా శ్రద్ధ వహిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఏ పరీక్ష ఫలితాలు వచ్చినా కార్పొరేట్ విద్యా సంస్థలదే పైచేయిగా నిలిచేది. ఇప్పుడు ఆ పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులు కార్పొరేట్‌తో పోటీ పడుతున్నారు. అత్యధిక మార్కులు సాధిస్తూ ఔరా! అనిపిస్తున్నారు. గుణాత్మక విద్యా విధానం, బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలు ప్రభుత్వ కాలేజీల ముందడుగుకు దోహదపడుతున్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఫలితాల్లో మెరుగు

ఈ ఏడాది ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలను విశ్లేషిస్తే ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులు సత్తా చాటారు. రెక్కాడితేనే కానీ డొక్కాడని రోజు కూలీలు, కౌలు రైతులు, చిరు వ్యాపారులు, ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలు ప్రభుత్వ కాలేజీల్లో చదువుతూ 900 పైబడి మార్కులు సాధించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 45 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. వీటి నుంచి ఇంటర్ రెండో సంవత్సర పరీక్షలకు 5,316 మంది హాజరయ్యారు. వీరిలో 2,219 మంది ఉత్తీర్ణులయ్యారు. 41.74 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఐదు జూనియర్ కాలేజీలు ఉత్తమంగా నిలిచాయి. దేవీపట్నం, మామిడికుదురు, గొల్లప్రోలు, అమలాపురం, వై.రామవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఈ జాబితాలో ఉన్నాయి. మారుమూల ఉన్న దేవీపట్నం (ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా) ప్రభుత్వ జూనియర్ కాలేజీ 70 శాతంతో మొదటి స్థానంలో నిలవడం విశేషం.

టాప్ కాలేజీల తీరు

ప్రభుత్వ కళాశాల	హాజరు	పాస్	ఉత్తీర్ణతా శాతం
దేవీపట్నం	30	21	70.00
మామిడికుదురు	85	52	61.18
గొల్లప్రోలు	88	53	60.23
అమలాపురం	118	67	56.78
వై.రామవరం	43	24	55.81
రాజమహేంద్రవరం	462	247	53.46

“ గతంతో పోల్చితే బెటర్



గత ఏడాదితో పోల్చితే ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత శాతం పెరిగింది. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు కార్పొరేట్‌కు పోటీ ఇచ్చారు. ఈ ఏడాది పాటు నిర్వహించిన విద్యా ప్రణాళికే ఇందుకు కారణం. అధ్యాపకులు శ్రమ పడ్డారు. జిల్లాను ముందుకు తీసుకెళ్లారు. ఫెయిలయిన విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు చెప్పిస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. వచ్చే ఏడాది ఫలితాల్లో నంబర్ వన్ స్థానం సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– ఐ.శారద, రీజినల్ జాయింట్ డైరెక్టర్, ఇంటర్మీడియెట్ బోర్డు జోన్ 1, 2 ”



నాడు-నేడుతో రూపురేఖలు మారుతున్న రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

1 నుంచి ప్రత్యేక తరగతులు

పరీక్షల్లో సబ్జెక్టులు తప్పిన విద్యార్థులకు విద్యా సంవత్సరం వృథా కాకుండా వచ్చే నెల 1 నుంచి 20వ తేదీ వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అధ్యాపకులతో ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సబ్జెక్టుల వారీగా బోధిస్తారు. మధ్యాహ్నం వేళ వీరికి ఉచితంగా స్నాక్స్ కూడా అందిస్తారు. దూర ప్రాంత విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. ప్రత్యేక తరగతుల ప్రక్రియ కలెక్టర్ల పర్యవేక్షణలో జరుగుతుంది.

గ్రూప్-1 అధికారినవుతా..



ఉన్నత విద్య అభ్యసించి గ్రూప్-1 అధికారిని అవుతా. ఇంటర్ ఎంపీసీలో 937 మార్కులతో ప్రథమ స్థానం సాధించాను. మా నాన్న పనసయ్య వ్యవసాయ పనులు చేసుకుంటూ, ఎంతో కష్టపడి నన్ను చవిదిస్తున్నారు. మంచి ఉద్యోగం సాధించి తల్లి దండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకువస్తా.

– బందారు విజయ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాజులూరు

ఎంబీబీఎస్ చేయాలని ఉంది



మాది మధ్యతరగతి కుటుంబం. బైపీసీలో 912 మార్కులు సాధించడం ఆనందంగా ఉంది. నీట్ కోచింగ్ తీసుకుంటున్నా. ఎంబీబీఎస్ చదవాలనుంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్నాను. అధ్యాపకులు చక్కగా బోధించారు.

– కంటా శ్రీలత, కొవ్వూరు, తూర్పు గోదావరి జిల్లా

క్లుప్తంగా

5న కొవ్వూరుకు సీఎం జగన్



కొవ్వూరు: వచ్చే నెల 5వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొవ్వూరు రానున్నారని హోం మంత్రి తానేటి వనిత శుక్రవారం తెలిపారు. 'వలంటీర్‌కు వందనం' రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో భాగంగా నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారన్నారు. వలంటీర్ల సేవలకు గుర్తింపుగా వారికి అవార్డులు అందజేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో ముఖ్యమంత్రి రోడ్ షో ఉంటుందని చెప్పారు. సభ నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలు శనివారం వెల్లడిస్తామని అన్నారు.

ముంచుకొస్తోంది.. ముహూర్తాల వేళ

- నేటితో ముగియనున్న గురు మౌఢ్యమి
- రేపటి నుంచి శుభ ముహూర్తాలు
- 42 రోజుల పాటు సందడే సందడి



కొవ్వూరు: నెల రోజుల విరామం తరువాత కల్యాణ మండపాలు మళ్లీ కళకళలాడనున్నాయి. మామిడి తోరణాలు కట్టిన వేదికలపై.. బంధుమిత్రుల కోలాహలం.. బాజాభజంత్రీల ఘోష నడుమ.. వేద మంత్రాల సాక్షిగా.. మూడు ముళ్లు వేసుకుని.. ఏడడుగులతో కొత్త జంటలు నవజీవనాన్ని ప్రారంభించనున్నాయి. గురు మౌఢ్యమి (మూఢం) కారణంగా నెల రోజులుగా శుభకార్యాలు నిలిచిపోయాయి. వైశాఖ శుద్ధ నవమి, శనివారంతో గురు మౌఢ్యమి ముగుస్తోంది. వైశాఖ శుద్ధ దశమి, ఆదివారం నుంచి పెళ్లిబాజాలు మళ్లీ మోగనున్నాయి. మే ఒకటి నుంచి 15వ తేదీ వరకూ పెళ్లిళ్లు, ఉపనయనాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, విగ్రహ ప్రతిష్ఠలు, బాలసారె, నూతన వ్యాపార సంస్థల ప్రారంభం వంటి వాటికి అనువైన ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు. అలాగే మే 16, 17, 18, 19 తేదీలు మినహా నెలంతా శుభ ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు. జ్యేష్ఠంలో మాసంలో కూడా మే 20 నుంచి జూన్ 14వ తేదీ వరకూ (జూన్ 6 మినహా) వరుసగా శుభలగ్నాలున్నాయి. జూన్‌లో శుభకార్యాలకు అనువైన రోజులు 13 ఉన్నాయని అంటున్నారు. మొత్తం మీద మే నెలలో ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో పలువురు ఇప్పటికే కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు బుక్ చేసేసుకున్నారు. క్యాటరింగ్, వంట మనుషులు, బాజాభజంత్రీలు, వివిధ రకాల డెకరేషన్ కార్మికులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్లు నిర్వహించే వారికి చేతి నిండా పని దొరకనుంది.

జూన్ 19 నుంచి మళ్లీ రెండు నెలలు బ్రేక్

జూన్ 19 నుంచి జూలై 18వ తేదీ వరకూ ఆషాఢ మాసం ఉంది. ఆ వెంటనే అధిక శ్రావణ మాసం వస్తోంది. జూలై 19 నుంచి ఆగస్టు 17వ తేదీ వరకూ అధిక శ్రావణం ఉంది. దీంతో ఈ రెండు నెలలూ పెళ్లిళ్లు, శంకుస్థాపనలు, గృహప్రవేశాలకు బ్రేక్ పడనుంది. అయితే, అధిక శ్రావణంలో పెళ్లిచూపులు, శీమంతాలు, బాలసారె, అన్నప్రాశన, నూతన వ్యాపారాల ప్రారంభం వంటివి నిర్వహించుకోవచ్చని పండితులు చెబుతున్నారు. ఈ మాసంలో గ్రహస్థితి, తిథులు, నక్షత్రాలు వంటివి అనుకూలించవని అంటున్నారు.

మేలో దివ్యమైన ముహూర్తాలు



మే నెలలో దివ్యమైన ముహూర్తాలున్నాయి. ఈ ఏడాది ఆషాఢం, అధిక శ్రావణ మాసాలు వరుసగా వస్తున్నాయి. ఈ సమయంలో వివాహాలు, శంకుస్థాపనలు, గృహప్రవేశాల ముహూర్తాలుండవు.

– తుట్టగుంట భైరవమూర్తి, జ్యోతిష పండితుడు, కొవ్వూరు

నాలుగు రోజులు మినహా..



శుభకార్యాలకు అనువైన ముహూర్తాలు ఆదివారం నుంచి ఉన్నాయి. మే నెలలో నాలుగు రోజులు మినహా మిగిలిన అన్నీ శుభ కార్యాలకు అనువైనవే.

– వారణాసి హనుమంతశర్మ, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ బ్రాహ్మణ పురోహిత సంఘం, కొవ్వూరు

ఇంటిగ్రేటెడ్ డిసీజ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ ఆవిష్కరణ



ఇంటిగ్రేటెడ్ డిసీజ్ మేనేజ్‌మెంట్ స్పెషల్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

అంబాజీపేట: జీవ నియంత్రణ కారకాల (ఇంటిగ్రేటెడ్ డిసీజ్ మేనేజ్‌మెంట్ – ఐడీఎం) స్పెషల్‌ను రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కొబ్బరిని ఆశించే తెగుళ్లను నివారించేందుకు అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు దీనిని రూపొందించారు. డాక్టర్ వైఎస్సార్ కడప జిల్లా అనంతరాజుపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన కళాశాలలో జరిగిన కార్యక్రమంలో దీనిని మంత్రి ఆవిష్కరించారని పరిశోధన కేంద్రం అధిపతి బి.శ్రీనివాసులు తెలిపారు. కొబ్బరిని ఆశించి, నష్టపరుస్తున్న గానోడెర్మా, నల్లమచ్చ, మొవ్వుకుళ్లు తెగుళ్లను నివారించే జీవనియంత్రణ కారకాలను ఈ స్పెషల్‌లో ఉంచామన్నారు. 50 శాతం ట్రైకోడెర్మా రిసి అనే బూజు జాతి సూక్ష్మ జీవనియంత్రిణ, 50 శాతం సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ అనే బ్యాక్టీరియా జాతి జీవనియంత్రణ కారకాలు ఇందులో ఉంటాయన్నారు. తెగుళ్ల ఆశించిన కొబ్బరి చెట్టు చుట్టూ పళ్లెం చేసి, ఏడాదికి ఒకసారి ఈ స్పెషల్‌ను 250 గ్రాముల వరకూ వేసుకోవాలని చెప్పారు.

నేత్రపర్వం.. వీరేశ్వరుని గ్రామోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్





ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు, కేరళ వాయిద్యకారుల విన్యాసాలు

- కోలాహలంగా రథోత్సవం
- మురమళ్లలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఐ.పోలవరం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వర స్వామివారి త్రిశూల స్నానం, రథోత్సవం తదితర వేడుకలను శుక్రవారం కోలాహలంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గవ్యాంతం, కళాన్యాసాలు, పూర్ణాహుతి, వసంతోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాజాభజంత్రీల ఘోష నడుమ స్వామివారిని వృద్ధ గౌతమీ తీరానికి తీసుకువెళ్లారు. అక్కడ పూజల అనంతరం నదిలో స్వామివారి త్రిశూల స్నానాన్ని పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ రథాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ సమర్పించిన విషయం తెలిసిందే. తొలుత ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే పొన్నాడ కొబ్బరి కాయ కొట్టి రథాన్ని లాగారు. సన్నాయి మేళంతో పాటు వేంకటేశ్వర వైభవం, బుట్టబొమ్మలు, ఆంజనేయస్వామి, కృష్ణా జిల్లా కళాకారుల కనక డప్పులు, కేరళ వాయిద్యాల వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సుమారు మూడు కిలోమీటర్ల మేర ఈ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి శ్రీపుష్పోత్సవం, పవళింపు సేవ వేడుకగా నిర్వహించారు. దీంతో ఐదు రోజులుగా జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

జిల్లా పవర్ లిఫ్టర్లకు 22 పతకాలు



రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా అసోసియేషన్ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 22 పతకాలు కైవసం చేసుకున్నారు. విశాఖపట్నంలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో 32 పాయింట్లతో నాలుగో స్థానం సాధించారు. అలాగే మే 1 నుంచి 5వ తేదీ వరకూ తిరుపతిలో జరగనున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు పి.వందన, బి.యశ్వంత్ ఎంపికయ్యారు.

విజేతలుగా నిలిచిన జిల్లా పవర్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను జిల్లా పవర్, బాడీ లిఫ్టింగ్ అసోసియేషన్ల ప్రతినిధులు అమలాపురంలోని హెల్త్ ఫిట్‌నెస్ జిమ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశాఖ పోటీల్లో అత్యంత ప్రతిభ చూపిన జిల్లా పవర్, వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు జిల్లా అసోసియేషన్ల నుంచి సంపూర్ణ సహకారం, ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. వెయిట్ లిఫ్టింగ్ జట్టు కోచ్ ఎంవీ సముద్రం, మేనేజర్ వి.నరేష్‌లను కూడా ప్రశంసించారు. విజేతలను జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వర రావు, పవర్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ల ప్రతినిధులు ముంగర ప్రసాద్, గంగుమళ్ల దొరబాబు, చిక్కం రాజబాబు, ముత్తాబత్తుల రమణ, చీకురుమిల్లి కిరణ్‌కుమార్ కూడా అభినందించారు. మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు.

అనుమానమే పెనుభూతమై..

- భార్య, అత్తపై కత్తితో దాడి
- ఆపై భయంతో చీమల మందు తాగిన నిందితుడు
- ముగ్గురికీ ఆసుపత్రిలో చికిత్స



దాడిలో గాయపడిన బాధిత మహిళలు

ఐ.పోలవరం: అనుమానమే పెనుభూతమైంది.. ఇద్దరు మహిళలపై హత్యాయత్నానికి కారణమైంది.. ఐ.పోలవరం మండలం గుత్తినదీవి గ్రామంలో ఈ దాడికి ఒడిగట్టిన నిందితుడు.. ఆపై భయంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై రాజేష్, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నిచ్చెనకోళ్ల రామకృష్ణ కొబ్బరి దింపు కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. అతడికి, మండపేటకు చెందిన యువతికి ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఐదేళ్ల లోపు వయస్సు ఉన్న ఇద్దరు మగ పిల్లలు పుట్టారు. ఇదిలా ఉండగా భార్యపై రామకృష్ణ కొన్నాళ్లుగా అనుమానం పెంచుకున్నాడు. దీంతో ఆమెను ఎలాగైనా మట్టుబెట్టాలని అనుకున్నాడు. ఈ నేపథ్యంలో భార్య శుక్రవారం ఉదయం నుంచీ అదే పనిగా ఎవరితోనో ఫోనులో మాట్లాడటం చూసి ఆగ్రహానికి గురయ్యాడు. విచక్షణ కోల్పోయిన అతడు.. కొబ్బరి దింపునకు ఉపయోగించే కత్తితో భార్యపై ఒక్కసారిగా దాడి చేశాడు. ఇదిలా ఉండగా కుమార్తెను చూసేందుకు ఆమె తల్లి (రామకృష్ణ అత్త) మేరీ రత్నం ఉదయం మండపేట నుంచి గుత్తినదీవి వచ్చింది. కుమార్తెపై దాడి చేస్తున్న క్రమంలో రామకృష్ణను మేరీ రత్నం అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దీంతో పట్టరాని ఆగ్రహానికి గురైన నిందితుడు మేరీ రత్నంపై కూడా కత్తితో దాడి చేశాడు. అనంతరం హత్యాయత్నానికి ఒడిగట్టానన్న విషయం స్ఫురణకు రావడంతో రామకృష్ణ భీతిల్లాడు. ఈ నేపథ్యంలో అతడు చీమల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ముగ్గురినీ స్థానికులు 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులతో పాటు అమ్మమ్మ కూడా ఆసుపత్రి పాలవడంతో రామకృష్ణ చిన్నారులు బిక్కుబిక్కుమంటూ విలపిస్తున్నారు. ఎస్సై రాజేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

37 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యాన వివిధ విభాగాలకు చెందిన 37 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఈ మేరకు కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రమేష్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుల డౌన్‌లోడ్, ఇతర వివరాల కోసం ఈస్ట్ గోదావరి.ఏపీ.జీఓవీ.ఇన్, కాకినాడ.ఏపీ.జీఓవీ.ఇన్, కోనసీమ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్లను సందర్శించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను 4వ తేదీలోగా కాకినాడలోని తన కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య అందించాలని డాక్టర్ రమేష్ సూచించారు.

ఆన్‌లైన్‌లో అర్హుల జాబితా

ఎన్‌హెచ్‌ఎం పరిధిలో గత జనవరిలో 152 పోస్టుల భర్తీకి వెలువడిన నోటిఫికేషన్‌కు సంబంధించిన ఎంపిక ప్రక్రియ పూర్తయింది. అర్హులైన అభ్యర్థుల జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచామని డాక్టర్ రమేష్ తెలిపారు. ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ జాబితా అందుబాటులో ఉందన్నారు.

'తిరుమల'లో రేపు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు 6, 7, 8, 9, 10 తరగతుల్లో చేరే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ, ఎన్ఐటీతో పాటు వైద్య కళాశాలల్లో ప్రవేశ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. విద్యార్థి దశలో పిల్లలు నేర్చుకోవలసిన విషయాలు, తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంజినీరింగ్, వైద్య విద్య కోసం సన్నద్ధమవ్వాల్సిన పరీక్షలు, కళాశాలలపై ప్రముఖ విద్యావేత్త, కౌన్సెలర్, తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అవగాహన కల్పిస్తారని వివరించారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

- తన జల్సాలను ప్రశ్నిస్తున్నాడని భర్తను హత్య చేసిన జమలమ్మ
- ఎన్టీఆర్ జిల్లాలో ఘటన

విజయవాడ స్పోర్ట్స్ : తన జల్సాలకు అడ్డుపడుతున్న భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మీ శుక్రవారం తీర్పు చెప్పారు. 2016 నవంబర్ 23న కొత్తపేట (టూ టౌన్) పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఈ ఘటన అప్పట్లో నగర ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన జమలమ్మకు జి.కొండూరు మండలం వెంకటాపురానికి చెందిన ఏడుకొండలు(32)కు 16 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్నాళ్లకు జమలమ్మ చెడు వ్యసనాలకు బానిసైంది. వీటిపై ప్రశ్నిస్తున్న భర్త ఏడుకొండలును అడ్డు తొలగించుకోవాలనే నిర్ణయాన్ని తన చెల్లెలు లక్ష్మికి వివరించింది. అదే గ్రామంలో హత్య చేస్తే అనుమానం వస్తుందనే ఉద్దేశంతో కాపురాన్ని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పి.నైనవరం గ్రామానికి మార్చింది. అంబాపురంలో కొత్త ఇంట్లోకి ప్రవేశించిన రోజునే చెల్లెలు లక్ష్మి, న్యూఆర్ఆర్ పేటకు చెందిన ఒడియార్ గణేష్, జక్కంపూడికి చెందిన బాలసాని తిరుపతి సాయంతో జమలమ్మ తన భర్త ఏడుకొండలు మెడకు తాడు చుట్టి చంపేసిందని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. మూడు రోజుల తర్వాత ఆ గది నుంచి వస్తున్న దుర్వాసను పసిగట్టిన ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జమలమ్మకు కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. మిగిలిన నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో నిర్దోషులుగా విడుదలయ్యారు.

చైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతి చెందిన వాణి

పెనమలూరు : శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన జగన్నాథం వాణి(17) కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీ చదువుతోంది. గత రెండు రోజుల కిందట ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయింది. కాగా గురువారం వాణి సోదరుడు రాము కాలేజీ హాస్టల్‌కు వచ్చి వాణితో మాట్లాడి వెళ్లాడు. అయితే శుక్రవారం ఉదయం కాలేజీ హాస్టల్‌లో స్టడీ అవర్‌కు రావాల్సిన వాణి రాలేదు. దీంతో ఆమె కోసం రూమ్‌కు వెళ్లి మిత్రులు చూడగా ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని మృతి చెంది ఉంది. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమంలో పాల్గొనం

గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

సాక్షి, అమరావతి: రాజకీయ స్వార్థంతో జరిగే ఉద్యమాల్లో పాల్గొనబోమని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వంపై పోరాటం చేసే విధంగా కొన్ని శక్తులు సచివాలయ ఉద్యోగులను రెచ్చ గొడుతున్నాయని తెలిపింది. సచివాలయ ఉద్యోగులు వారి మాటలకు ప్రభావితం కావొద్దని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా, ప్రధాన కార్యదర్శి పుట్టి రత్నం, ఉపాధ్యక్షులు సిరిపురం హరి, కె.రామకృష్ణా రెడ్డి, జి.హరీంద్ర, కె.కిరణ్, బి.పుల్లారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడానికి కొందరు కుట్ర చేస్తున్నారని, ఇలా కుట్ర పన్నిన వారెవ్వరూ తమకు ఉద్యోగాలివ్వలేదని చెప్పారు. తమను ఉద్యోగులుగా గుర్తించని వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్న సచివాలయ ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీయడానికి చేస్తున్న కుట్రను ఖండిస్తున్నట్లు తెలిపారు.

ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

అధ్యక్ష , కార్యదర్శులుగా కె.వైధురిదేవి, ఎ.సుస్మిత


ఎన్నికైన సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షురాలిగా కె.వైధురి దేవి, ఉపాధ్యక్షురాలిగా ఎం.లక్ష్మణ కుమారి, కార్యదర్శిగా ఎ.సుస్మిత, అదనపు కార్యదర్శి(జనరల్)గా ఎం.రాజేశ్వరి, అదనపు కార్యదర్శి (కల్చరల్)గా ఎస్.నాగ లలితాదేవి, సంయుక్త కార్యదర్శిగా కె.సునీత, కోశాధికారిగా టి.శారద ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె.విజయలక్ష్మి, డి.సాహిత్య వ్యవహరించనున్నారు. ఈ ఎన్నికల వివరాలను ఎన్నికల అధికారి ఎస్.శాంతి కుమారి శుక్రవారం ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన ఉద్యోగుల హక్కుల రక్షణకు చర్యలు

ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

సాక్షి, అమరావతి: గిరిజన ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు చెప్పారు. పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఎస్టీ ఉద్యోగుల సర్వీసు సమస్యలపై గురు, శుక్రవారాల్లో విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ విచారణ నిర్వహించింది. ఈ విచారణకు అధ్యక్షత వహించిన రవిబాబు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యలపై ఏడు శాఖలకు చెందిన అధికారులను పిలిచి విచారించినట్లు తెలిపారు. గిరిజన ఉద్యోగులకు న్యాయం జరిగే విధంగా సూచనలు చేసినట్లు చెప్పారు. గిరిజన ప్రజల నివాస, వ్యవసాయ భూముల సమస్యలపై కూడా విచారణ చేసి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. రాష్ట్రంలో గిరిజన ప్రజలు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ కార్యదర్శి డాక్టర్ గంగాధర్, డిప్యూటీ డైరెక్టర్ పాట్లూరి పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల విలువ పెంపుతో గిరి రైతు మనుగడ

- అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జగన్నాథరావు
- కనుల పండువగా విత్తనాల పండగ

డుంబ్రిగుడ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏజెన్సీలో పంటల ఉత్పత్తుల విలువ హెచ్చింపుతోనే గిరిజన రైతులకు మనుగడ ఉంటుందని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జగన్నాథరావు అన్నారు. డుంబ్రిగుడ మండలం కిల్లోగుడ గ్రామంలో సంజీవని సంస్థ, థింసా గిరిజన ఉత్పత్తిదారుల సంఘం సంయుక్తంగా శుక్రవారం జీవ వైవిధ్య జాతరలో భాగంగా విత్తనాల పండగను ఘనంగా నిర్వహించింది. గిరిజన రైతుల సంప్రదాయ విత్తనాలతో పాటు ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలు సంస్థల ప్రతినిధులు దేశీయ విత్తనాల స్టాళ్లను ప్రదర్శించారు. డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ పాత విత్తనాల ద్వారా గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న అన్ని పంటల్లోనూ పోషక విలువలు అధికంగా ఉన్నాయన్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సురేష్‌కుమార్, రైతు సాధికారత సంస్థ రీజినల్ టెక్నికల్ అధికారి ఎం.సుందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగులోనూ రైల్వే టికెట్ బుకింగ్

- ఫోన్‌లో యూటీఎస్ యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం
- అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్‌లో సరికొత్త సేవలు
- ఆన్‌లైన్, యాప్‌ల్లో జనరల్ టికెట్ల బుకింగ్ ఇక సులువు
- రైల్వేస్టేషన్లలో క్యూలైన్ల బాధలకు చెక్


క్యూలైన్‌లో రైల్వే టికెట్ కోసం నిలబడి ఉన్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: జనరల్ టికెట్ కోసం ఆదరాబాదరాగా రైల్వేస్టేషన్‌కు చేరుకుని.. చాంతాడంత పొడవు ఉండే క్యూలైన్లలో నిలబడి.. ఈలోపు తాము ఎక్కాల్సిన రైలు వెళ్లిపోతుందేమోనని ఆదుర్దా పడేవారే ఎక్కువ. ఇలా ఇబ్బందులు పడే ప్రయాణికుల కోసం రైల్వే శాఖ నాలుగేళ్ల క్రితం అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్)ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. యూటీఎస్ విధానంలో యాప్, వెబ్‌సైట్ ద్వారా రైలు టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఇంగ్లిష్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు దీన్ని ప్రాంతీయ భాషలకు కూడా రైల్వే శాఖ విస్తరించింది. దీంతో తెలుగు సహా వివిధ ప్రాంతీయ భాషల్లోనూ టికెట్లు బుక్ చేసుకోవచ్చు. సాధారణ (జనరల్) రైలు టికెట్లను దిగువ శ్రేణి ప్రయాణికులు ఎక్కువగా తీసుకుంటారని.. వీరి కోసం ప్రాంతీయ భాషల్లో యాప్‌ని తీసుకొస్తే వినియోగం మరింత పెరుగుతుందనే ఉద్దేశంతో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

ఎలాంటి శ్రమ లేకుండా యాప్ నుంచే..

యూటీఎస్ యాప్ ద్వారా ఎలాంటి శ్రమ లేకుండా మొబైల్ ఫోన్ నుంచే జనరల్ టికెట్ పొందొచ్చు. అయితే టికెట్ బుక్ చేసుకోవడానికి ఇంగ్లిష్ మాత్రమే అందుబాటులో ఉండటంతో గ్రామీణులు, పెద్దగా చదువుకోనివారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సులభంగా యాప్ వినియోగించేలా ప్రాంతీయ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీ, కన్నడం, మలయాళం, మరాఠీ, ఒడియా, తమిళ భాషల్లోనూ టికెట్ బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీనిద్వారా జనరల్ టికెట్‌తో పాటు ప్లాట్‌ఫామ్ టికెట్ కూడా కొనుగోలు చేయొచ్చు. అలాగే సీజన్ టికెట్ బుకింగ్, రెన్యువల్ సైతం చేసుకోవచ్చు. యూటీఎస్ యాప్‌లో ప్రాంతీయ భాషల అప్‌డేట్ వెర్షన్‌ను ఆండ్రాయిడ్, ఐవోఎస్ రెండింటిలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. హార్డ్ కాపీ, పేపర్‌లెస్ టికెట్.. రెండు ఆప్షన్లు ఉన్నాయి.

యూటీఎస్ యాప్

ఎన్ని భాషల్లో: తెలుగు, ఇంగ్లిష్, కన్నడం, మలయాళం, హిందీ, తమిళం, ఒడియా, మరాఠీ
దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న రైల్వేస్టేషన్లు: 9,120
డౌన్‌లోడ్ చేసుకున్నవారు: 10 మిలియన్లకు పైగా
యాప్ ద్వారా రోజుకు బుక్ అవుతున్న టికెట్లు: 2.34 లక్షలు
రోజూ వినియోగిస్తున్న ప్రయాణికులు: 14.21 లక్షల మంది

స్టేషన్‌కు 5 కి.మీ. పరిధిలో..



మొబైల్‌లోని జీపీఎస్ ఆధారంగా యూటీఎస్ యాప్ పనిచేస్తోంది. టికెట్ బుక్ చేసుకునే సమయంలో మొబైల్ జీపీఎస్ లొకేషన్ ఆన్‌లో ఉండాలి. రైల్వేస్టేషన్ ఆవరణకు 30 మీటర్ల నుంచి 5 కి.మీ. పరిధిలో ఉన్న ప్రయాణికులు మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా యాప్ ద్వారా 3 నెలలు, 6 నెలలు లేదా సంవత్సరానికి సీజన్ టికెట్లను తీసుకోవచ్చు. ఎక్స్‌ప్రెస్, మెయిల్, ప్యాసింజర్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు యూటీఎస్ టికెట్ బుకింగ్ చెల్లుబాటు అవుతుంది.
– అనూప్‌కుమార్ సత్పతి, డీఆర్‌ఎం, వాల్తేరు

ఆ సంఘాల ఆందోళనలకు దూరంగా ఉందాం

- గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు
- ఒకే విడతన 1.34 లక్షల ఉద్యోగాలిచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- సచివాలయ ఉద్యోగులకు, ప్రభుత్వం మధ్య సుహృద్భావ వాతావరణం ఉంది
- కొన్ని సంఘాలు స్వార్థం కోసం దానిని చెడగొట్టడానికి చూస్తున్నాయి
- సచివాలయాల ఉద్యోగులందరూ గమనించాలి
- ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనవద్దు

సాక్షి, అమరావతి : స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని ఉద్యోగ సంఘాలు చేపట్టిన ఆందోళనలకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు దూరంగా ఉండాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ యూనియన్ పిలుపునిచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి, ఒకే విడతలో లక్ష మందికి పైగా ఉద్యోగాలిచ్చి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని తెలిపింది. అలాంటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని ఉద్యోగ సంఘాలు శనివారం నిర్వహించతలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనవద్దని తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య సుహృద్భావ వాతావరణం ఉందని, కొన్ని ఉద్యోగ సంఘాలు స్వార్థ, రాజకీయ అవసరాలకు ఆ వాతావరణాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఉద్యోగులందరూ దీనిని గమనించాలని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు, అదనపు ప్రధాన కార్యదర్శి బీఆర్ఆర్ కిషోర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకే నోటిఫికేషన్ ద్వారా 1.34 లక్షల గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగాలను భర్తీ చేసి, ఇచ్చిన మాట ప్రకారం ప్రొబేషన్ డిక్లేర్ చేసి అందరినీ శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులర్ చేసిన సీఎం జగన్‌కు సచివాలయాల ఉద్యోగులందరూ ఎప్పటికీ కృతజ్ఞులుగానే ఉంటారని పేర్కొన్నారు. ఉద్యోగులు కోరిన విధంగా 010 పద్దు కింద జీతాలు ఇచ్చారని, డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో నెగిటివ్ మార్కులు తొలగించారని, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు, శానిటేషన్ సెక్రటరీలకు వీక్లీ ఆఫ్‌లు ఇచ్చారని తెలిపారు. సచివాలయాల ఉద్యోగులకు అనేక మేళ్లు జరిగాయంటే సీఎం జగన్‌కు మనపై ఉన్న ప్రేమాభిమానాలే కారణమని చెప్పారు.

బదిలీలపై గందరగోళం సృష్టిస్తున్నారు

సచివాలయాల ఉద్యోగులు చాలా మంది వివిధ కారణాలతో బదిలీలు కోరుకుంటున్నారని తెలిసిన వెంటనే సీఎం జగన్ అంగీకారం తెలిపారన్నారు. సచివాలయాల మహిళా ఉద్యోగులు పెళ్లి చేసుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తే.. కొన్ని ఉద్యోగ సంఘాల నాయకులు రిక్వెస్టు బదిలీలు కాదని, సాధారణ బదిలీలు జరపాలని వితండ వాదం చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్ల సర్వీస్ పూర్తయి బదిలీ కావాలని కోరుకున్నా ట్రాన్స్‌ఫర్ చేయకూడదని, మూడేళ్ల సర్వీస్ పూర్తయిన వారందరినీ బదిలీ చేయాలని వాళ్లు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సచివాలయాల ఉద్యోగులందరినీ బదిలీ చేయమని చెప్పడానికి వీళ్లెవరని నిలదీశారు. బదిలీ వద్దనుకొనే ఉద్యోగిని కూడా బలవంతంగా బదిలీ చేయమనడానికి వీళ్లకేం హక్కుందన్నారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకే సాధారణ బదిలీ చేయడం సంప్రదాయంగా వస్తోందని, ఇప్పుడు సచివాలయ ఉద్యోగులకు మాత్రం మూడేళ్లకే సాధారణ బదిలీలు చేయమని ఉద్యోగ సంఘం నాయకులు ఎలా అడుగుతారని అన్నారు. గందరగోళం సృష్టించి బదిలీ ప్రక్రియను అడ్డుకోవడానికి కొందరు జేఏసీల పేరుతో ఉద్యోగులను రెచ్చగొడుతున్నారని తప్పుపట్టారు. దీనిని అందరూ గమనించాలని కోరారు. సచివాలయాల ఉద్యోగులు ఆ ధర్నాలు, నిరసనలు, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు.

ఏయూలో ఉద్యోగ విప్లవం

- ఒకే వేదికపై 761 మందికి ఆఫర్ లెటర్స్
- తల్లిదండ్రుల సమక్షంలో ఉద్యోగ పత్రాలు


తల్లిదండ్రులకు నమస్కరిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): అమ్మానాన్నల పాదాలకు విద్యార్థులు నమస్కరించారు. తమ అభ్యున్నతికి అహరహం శ్రమించిన తల్లిదండ్రులను విశ్వవిద్యాలయం వేదికగా విద్యార్థులే సత్కరించారు. ఈ అరుదైన సంఘటన గురువారం ఆంధ్రవిశ్వవిద్యాలయం (ఏయూ)లో కనిపించింది. విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైన్స్ కళాశాల అచీవర్స్ డే దీనికి వేదికైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగ విప్లవానికి వేదికగా నిలిచింది. ఏయూలో ఉద్యోగాలు సాధించిన 761 మంది విద్యార్థులకు ఆ వేదికపై నియామక పత్రాలను అందించే కార్యక్రమాన్ని ఏయూ నిర్వహించింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఏయూ రాష్ట్రానికి ఆదర్శంగా, విశ్వవిద్యాలయాలకు మార్గదర్శిగా నిలుస్తోందని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రత్నాల్లాంటి పిల్లలను పెంచి విశ్వవిద్యాలయానికి పంపిన తల్లిదండ్రులందరినీ సన్మానించడం చూసి గర్విస్తున్నామన్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు. వర్సిటీలో ప్రతి విద్యార్థి ఉద్యోగ సాధన, ఉపాధి కల్పన చేసే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారని, దీన్ని సాకారం చేసే దిశగా ఏయూ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి ఇచ్చే నిజమైన సంపద విద్య అని ముఖ్యమంత్రి ఇదే వేదిక నుంచి అన్నారని గుర్తుచేశారు. క్రమశిక్షణతో మీ పిల్లలను పెంచినందుకు మీ అందరికీ వందనం అంటూ తల్లిదండ్రులకు నమస్కరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది 81 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, ఈ సంవత్సరం దీన్ని అధిగమించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఆర్.రెడ్డి తదితరులు ప్రసంగించారు.

వేదాలు విజ్ఞాన భాండాగారాలు

- రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్
- ఘనంగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం
- ఇద్దరికి మహా మహోపాధ్యాయ, ఇద్దరికి వాచస్పతి పురస్కారాలు
- 539 మందికి డిగ్రీ పట్టాలు ప్రదానం


స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్

తిరుపతి ఎడ్యుకేషన్: వేదాలు విజ్ఞాన భాండాగారాలని, ఆధునిక మానవ సమాజం శాంతి, సౌఖ్యాలతో జీవించడానికి వీటిలోని అంశాలు ఎంతగానో దోహదం చేస్తాయని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చెప్పారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం శుక్రవారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. వర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ ఈ స్నాతకోత్సవానికి హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన వేద పండితులు వి.సుబ్రహ్మణ్య శాస్త్రి సలక్షణ ఘనాపాఠి, చెన్నైకి చెందిన ఆర్. మణి ద్రావిడ శాస్త్రికి మహా మహోపాధ్యాయ పురస్కారాలను గవర్నర్ ప్రదానం చేశారు. అన్నవరానికి చెందిన కె. రామ సోమయాజి శాస్త్రి, మైసూరుకు చెందిన సి.వంశీకృష్ణ ఘనాపాఠికి వాచస్పతి పురస్కారాలను అందజేశారు. సర్టిఫికెట్ కోర్సుల నుంచి పీహెచ్‌డీ వరకు వేద విద్యనభ్యసించిన 539 మందికి డిగ్రీ పట్టాలను అందజేశారు. గవర్నర్ మాట్లాడుతూ.. వేలాది సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు గణిత, వైజ్ఞానిక, ఆర్థిక, సాంకేతిక, జ్యోతిష్య శాస్త్రాలను వేదాల్లోని వైదిక అంశాలతో మేళవించి ప్రపంచానికి తెలియజేశారన్నారు. భారతీయ సంప్రదాయం, ఆధునిక శాస్త్ర సాంకేతికత మధ్య సమన్వయం పెంపొందించుకోగలిగితే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ రాధే శ్యాం, ఈసీ సభ్యులు హరే కృష్ణ శతపతి, ఫణి యాజులు తదితరులు పాల్గొన్నారు.

కడప దర్గాను దర్శించుకోవడం నా అదృష్టం

కడప కల్చరల్/రాజంపేట/ఒంటిమిట్ట: మతసామరస్యానికి ప్రతీక అయిన కడప అమీన్‌పీర్ దర్గాను దర్శించుకోవడం తన అదృష్టమని, ఇది దైవం కల్పించిన మహాభాగ్యంగా భావిస్తున్నానని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన కడప పెద్ద దర్గాకు వచ్చారు. దర్గాలో గవర్నర్ పూలచాదర్ సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గవర్నర్ వెంట ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, కడప నగర మేయర్ సురేష్‌బాబు, కలెక్టర్ విజయరామరాజు ఉన్నారు.

ఒంటిమిట్ట రాములోరిని దర్శించుకున్న గవర్నర్

ఒంటిమిట్టలోని కోదండరాముడిని గవర్నర్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. గవర్నర్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేశ్, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. గవర్నర్ వైఎస్సార్ జిల్లా పర్యటన ముగించుకుని ఒంటిమిట్ట నుంచి సాయంత్రం 6.03 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు. శనివారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లో రూ.2 లక్షల నష్టం.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ఫీజుల పేరుతో పెదనాన్న, బాబాయిల దగ్గర్నుంచి నగదు వసూలు
- ఆన్‌లైన్‌లో లుడో ఆడి డబ్బులు పోగొట్టుకున్న వైనం
- ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చేర్పించిన స్థానికులు

బాపట్లటౌన్ : ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి బీటెక్ విద్యార్థి రూ.2 లక్షలు నష్టపోయి చివరకు ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. కర్లపాలెం మండలం చింతాయపాలేనికి చెందిన తాళ్లూరి వెంకటనారాయణ విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 27న ఉదయం ఆన్‌లైన్‌లో లుడో గేమ్ తన స్నేహితులతో కలిసి ఆడాడు. ఈ గేమ్‌లో తొలుత రూ.100 పెట్టుబడికి రూ.1000 వరకు వచ్చాయి. ఇదే మోజులో సాయంత్రం వరకూ ఆడుతూనే ఉన్నాడు. ఇంతలో పాకెట్‌మనీ నిమిత్తం చేతిలో ఉంచుకున్న రూ.30 వేలు పోయాయి. తర్వాత తన స్నేహితుడి వద్ద రూ.70 వేలు, తన పెదనాన్న, బాబాయిలకు ఫోన్ చేసి కళాశాలలో ఫీజు చెల్లించాలంటూ నమ్మబలికి మరో రూ.లక్ష వరకూ తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో విడతల వారీగా రూ.2 లక్షలు కోల్పోయాడు. దీంతో ఏం చేయాలో పాలుపోక శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి రైలు మార్గాన బాపట్ల చేరుకున్నాడు. అప్పటికే ఎలుకల పేస్ట్ తిన్నాడు. రైల్వేస్టేషన్‌లో తీవ్ర ఇబ్బంది పడుతుండటాన్ని ప్రయాణికులు గమనించి స్టేషన్‌మాస్టర్ సాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు.

ఐఐటీలకు దీటుగా ఉద్యాన వర్సిటీ

- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అకడమిక్ బ్లాక్, హాస్టళ్లను ప్రారంభిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల

రైల్వేకోడూరు: ఐఐటీలు, ఎన్ఐటీలకు దీటుగా ఉద్యాన, వ్యవసాయ వర్సిటీలను తీర్చిదిద్దుతామని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. అన్నమయ్య జిల్లా అనంతరాజుపేటలోని వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో రూ.22.81 కోట్లతో నిర్మించిన అకడమిక్ బ్లాక్, రెండు గర్ల్స్ హాస్టళ్లు, ఒక బాయ్స్ హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఉత్పత్తుల ఎగ్జిబిషన్ భవనాలను శుక్రవారం మంత్రి కాకాణి ప్రారంభించారు. వనిపెంటలోని కేవీకే అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటుచేసిన ఉద్యాన వర్సిటీ అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ అభివృద్ధికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పరిధిలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అనంతరాజుపేట కళాశాలలో రైతుల వసతిగృహం, అతిథిగృహం ఏర్పాటుచేయాలని మంత్రిని కోరారు. వైఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ టి.జానకీరాం మాట్లాడారు. అనంతరం పుట్టగొడుగుల సాగుపుస్తకం, కరపత్రాలు, అంబాజీపేట పరిశోధనా స్థానం రూపొందించిన కొబ్బరి సాగుకు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు

- ఈ ఏడాది నుంచి రీస్ట్రక్చర్.. సిలబస్ రీడిజైన్
- ఈ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు
- ఫ్యాప్సీ అవార్డుల సన్నాహక కార్యక్రమంలో ఆర్థిక మంత్రి బుగ్గన


మాట్లాడుతున్న ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం: ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సుల్లో సమూల మార్పులు తీసుకొస్తున్నట్లు ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రీస్ట్రక్చర్‌తో పాటు సిలబస్‌ను రీడిజైన్ చేస్తామని తెలిపారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫ్యాప్సీ) ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2023 సన్నాహక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేసిన వారు నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఆటోమొబైల్ రంగాల్లో వీరు తమ నైపుణ్యంతో రాణించేలా తయారు చేస్తామని చెప్పారు. వాణిజ్యం, పారిశ్రామికాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఐటీఐల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో 192 స్కిల్ హబ్‌ల్లో మెరికలు తిరిగే కోర్సులను డిజైన్ చేశామని, వీటి ద్వారా వేలాది మంది యువతకు నైపుణ్య శిక్షణను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. అర్హులైన పారిశ్రామికవేత్తలకు ఫ్యాప్సీ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కొత్త పారిశ్రామిక పాలసీలో కొన్ని మార్పులు చేయాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి అవసరమైతే మార్పులు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇండస్ట్రియల్ హోదా కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులను కూడా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు కీలకపాత్ర ఉందన్నారు. ఫ్యాప్సీ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి కరుణేంద్ర మాట్లాడుతూ ఫ్యాప్సీ ఎక్స్‌లెన్స్–2023 అవార్డుల కోసం జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 11 కేటగిరీల్లో ఈ అవార్డులుంటాయని, ఈ అవార్డులు ఇవ్వడానికి 11 మంది పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని తెలిపారు. ఈ అవార్డులను ఆగస్టు ఆఖరు లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ప్రదానం చేస్తామని చెప్పారు.అనంతరం అవార్డుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు, మాజీ అధ్యక్షుడు అచ్యుతరావు, ఎఫ్‌టీసీసీఐ సీఈవో ఖ్యాతి తదితరులు పాల్గొన్నారు.